వెన్నుపోటుకు చిరునామా చంద్రబాబు

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- ఎల్లయ్యపేటలో బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: మోసం, దగా, వెన్నుపోటులకు చిరునామా చంద్రబాబు అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఎల్లయ్యపేటలో ఆదివారం మండలస్థాయి బూత్ కన్వీనర్లు, గృహసారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనలో ప్రజలకు మంచి చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పాలనా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే అందించారన్నారు. ఈసారి మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, వృద్ధాప్య పింఛన్లు, మత్స్యకార బీమా, మత్స్యకార భరోసాతో పాలు పలు పథకాల పరిధిని పెంచారన్నారు. సీఎం జగన్ మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ప్రతి హామీని అమలు చేశారన్నారు. అధికారం కోసం ప్రతిపక్షాలు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. జగన్ పాలనతో సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఇంటికీ రూ.3 నుంచి రూ.4 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ గెలిపించేందుకు బూత్ కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. తొలుత కాకినాడ జిల్లా జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ మాట్లాడారు. జగన్ చేసిన మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, ఏలేరు రిజర్వాయర్ చైర్మన్ తోలాడ శైలాపార్వతి, మండల బూత్ కమిటీ కన్వీనర్ బెక్కం చంద్రగిరి, పార్టీ నాయకులు దడాల విజయ్, అంగుళూరి సుశీలా రాణి, ఆరుమిల్లి ఏసుబాబు, సర్పంచ్ సింగిరి సింగారావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



వేలంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

కిర్లంపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని సింహాద్రిపురం, వేలంక, గెద్దనాపల్లి, భూపాలపట్నం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలిత వేలంకలోని దోమాల గంగాధర్ నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం నెరవేర్చారన్నారు. ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేస్తారన్నారు. గతంలో చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ప్రజలకు సబ్సిడీ రుణాలు కల్పించి చిన్న పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, నంది వెంకన్న, కలిపిరెడ్డి కాశీవిశ్వనాథం, దోమాల గంగాధర్, దాడి చినబుజ్జి, సీలగిరి చిట్టిబాబు, మొల్లేటి గంగాధర్, బేరి బాబ్జీ, అరబోలు వాసు తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో జీవన ప్రమాణాలు మెరుగు

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు
- శంఖవరంలో ఎన్నికల ప్రచారం



శంఖవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరంలో ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, అభిమానులు, ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ప్రజలకు ఏం చేయగలమో.. ఎంత మంచి చేయొచ్చో అదే మేనిఫెస్టోలో చెప్పారన్నారు. నవరత్న పథకాలను మరింత మెరుగు పరిచి మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుడాల రామకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, పర్వత మోహన్, ఈగల అప్పారావు, శెట్టిబత్తుల కుమార్ రాజా, గౌతు నాగు, గాబు కృష్ణ, దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, సర్లమర్ల మధు, నాచంట వెంకటేశ్వరరావు, పర్వత వివేక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక



ఎస్.అన్నవరంలో పార్టీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీలో చేరికలు భారీగా పెరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎస్.అన్నవరానికి చెందిన మాజీ సర్పంచ్ వంగలపూడి శ్రీనివాసరావు, వంగలపూడి బుజ్జితో పాటు 200 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి, రాజా నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రాజా విజయం కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం పని చేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కలిపిస్తామని రాజా భరోసా ఇచ్చారు. యనమల కృష్ణుడు, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు, గాంధీనత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజెలకు భలే గిరాకీ



అమ్మకానికి సిద్ధం చేసిన తాటిముంజెలు



తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలతో పాటు ఆరోగ్య ప్రదాయిని అయిన తాటి ముంజెలను ఎక్కువగా తీసుకుంటున్నారు. తాటి ముంజెలు వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు వీటిలో అధిక పోషకాలు ఉండడంతో కొనుగోలు చేసేందుకు జనం ఎంతో ఆసక్తి చూపుతున్నారు. పలువురు వీటిని విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. తాటిచెట్లకు ఉండే కాయల నుంచి వీటి తీసి అమ్ముతున్నారు. డజన్ రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా వేసవిలో తాటి ముంజెలను పంచదారతో కలిపి తింటే దీని రుచే వేరని పెద్దలు చెబుతారు. ఏలేశ్వరంలో కల్లుగీత కార్మికులు పలుచోట్ల దుకాణాలు వేసి వీటిని అమ్ముతున్నారు. ఉదయం నుంచి అమ్మకాలు ప్రారంభించగా మధ్యాహ్నానికే హాట్‌కేక్‌ల్లా అమ్ముడైపోతున్నాయి. ప్రస్తుతం పలు గ్రామాలతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసి తాటి ముంజెలను విక్రయిస్తున్నారు.

నేడు జాబ్ మేళా

తుని రూరల్: వి.కొత్తూరులోని నోబుల్ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కారస్పాండెంట్ జి.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 12 కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటాయని, 1200 పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి చైత్రమాసోత్సవాలు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు సోమవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

సంగీత, నృత్య శిక్షణా తరగతులు ప్రారంభం



గోకవరంలో శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు, తదితరులు

గోకవరం: యువత భారతీయ ప్రాచీన కళలను అభ్యసించాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యువతకు కర్నాటక సంగీతం, కూచిపూడి నాట్యం శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనకళలకు పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో కళాభారతికి వందనం పేరుతో నామమాత్రపు రుసుముతో ఈ శిక్షణా తరగతులను ప్రారంభించామన్నారు. సుమారు 350 మంది ఈ శిక్షణా తరగతులకు నమోదు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న యువత భక్తిశ్రద్ధలతో అభ్యసించి నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, గురువులు కోట దివాకర్, నెల్లిపూడి ధనలక్ష్మి, సమితి సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటానికి ముందుకు రావాలి



బూరుగుపూడిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

కిర్లంపూడి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన, ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రజలు ముందుకు రావాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడాలని కోరుతూ ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ఏసీఎఫ్, పీఓడబ్ల్యూ, పీడీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన జనచైతన్యయాత్ర ఆదివారం బూరుగుపూడి చేరుకుంది. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తున్నారన్నారు. ఈసారి ఓట్ల కోసం వచ్చే నాయకులను రాష్ట్ర ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. తొలిత స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, రాష్ట్ర నాయకులు బాలుడు, కొండా దుర్గారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీహోమం



అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా ఆదివారం అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, కంచిబట్ల సాయిరామ్, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసాన్ని పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- వైఎస్సార్ సీపీలో 50 కుటుంబాల చేరిక



గోకవరంలో పార్టీలో చేరిన వారితో తోట నరసింహం

గోకవరం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. గోకవరంలో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. కృష్ణునిపాలెంలో పార్టీ నాయకుడు రౌతు జోగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి తోట నరసింహం పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూర్చే విధంగా సీఎం జగన్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ముత్యాల శ్రీనివాస్, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



గోకవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి
- గోకవరంలో ఎన్నికల ప్రచారం

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ మేలు చేకూరిందని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలో ఆదివారం మూడో రోజు పార్టీ శ్రేణులతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎంపీటీసీలు తోలేటి రమ్యశ్రీ, ఉనుకూరి అసిరమ్మ, నరాలశెట్టి గౌతమి, నాయకులు అక్షింతల రాజా, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి యేసురత్నం, టౌన్ కన్వీనర్ వీర్ల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు ఇజ్జిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- క్రైస్తవులు, పాస్టర్లతో సమావేశాలు



జగ్గంపేట చర్చిలో క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతున్న తోట రాంజీ

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి క్రైస్తవులు కృషి చేయాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ కోరారు. జగ్గంపేటలోని పలు చర్చిల్లో క్రైస్తవ సోదరులు, పాస్టర్లతో ఆయన ఆదివారం సమావేశాలు నిర్వహించారు. క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలతో పాటు క్రైస్తవుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడంలో క్రైస్తవులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికల్లో తోట నరసింహం విజయం సాధించాలని కోరుతూ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తోట రాంజీ కాట్రావులపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గడపగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, పార్టీ నేతలు గఫూర్, జగాల్, కాట్రావులపల్లి సర్పంచ్ పిట్టా సుగణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యూరి నాని తదితరులు పాల్గొన్నారు.

సన్ డే..

- మండిపోతున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు



ఏలేశ్వరంలో నిర్మానుష్యంగా మారిన హనుమాన్ జంక్షన్

ఏలేశ్వరం: భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వేసవి ఎండల తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండల ధాటికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నియోజకవర్గంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్రఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. ఏలేశ్వరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధానరహదారులు నిర్మానుష్యంగా మారాయి. వాహనదారులు ఎండ నుంచి రక్షణకు గొడుగులు, ముసుగులు ధరించారు. మధ్యాహ్నం జాతీయరహదారిపై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేశారు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవి ఎండలను తట్టుకొనేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. పనులను ఉదయం 10 గంటలలోపు ముగించుకోని ఇంటిలోనే ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు వెళితే టోపీలు, ముసుగులు ధరించాలి. నీరు, శీతల పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

జనరంజక పాలనకు పట్టం కట్టండి



ధర్మవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- ధర్మవరంలో ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనకు వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టండి అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరంలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని, ఈ మేనిఫెస్టోను అదే తరహాలో అమలు చేస్తారని ఆమె స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, సొసైటీ చైర్మన్ జువ్వల బాబులు, ఎంపీటీసీలు జువ్వల సుజాత, నానిపల్లి చంటి, ఉప సర్పంచ్ బొల్లు సీతారామరాజు, సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల చినబాబు, పార్టీ నాయకులు జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.